బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 26 ఫిబ్రవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4



## ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 607 పోస్టుల భర్తీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఖాళీగా ఉన్న 607 సహాయ ఆచార్యుల నియామకానికి మార్గం సుగమమైంది. నియామక ప్రక్రియలో భాగంగా వైద్య, ఆరోగ్య సేవల నియామక మండలి అభ్యర్థుల ప్రాథమిక వివరాలను బుధవారం విడుదల చేసింది. మండలి విడుదల చేసిన జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు అభ్యర్థులు ఫిర్యాదులు సమర్పించవచ్చని వెల్లడించింది. అభ్యర్థుల వ్యక్తిగత ప్రవేశ ఖాతా ద్వారా అందిన ఫిర్యాదులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేసింది. దరఖాస్తుల్లో జరిగిన పొరపాట్లు లేదా మెరిట్ లెక్కింపులో వ్యత్యాసాలు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించింది. అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన అనంతరం వాటిని పరిశీలించి తుది మెరిట్ జాబితాను సిద్ధం చేస్తామని పేర్కొంది.జాతీయ వైద్య కమిషన్ నిబంధనల ప్రకారం వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరతను తీర్చేందుకు ఈ నియామకాలు కీలకమని అధికారులు తెలిపారు. మెరిట్ జాబితా ఆధారంగా ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసి, వీలైనంత త్వరగా కొత్త సహాయ ఆచార్యులు విధుల్లో చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

## సీఎం రేవంత్‌రెడ్డి-అడోబ్ సీఈఓ చర్చలు

- గ్లోబల్ తయారీ, హరిత శక్తి, కృత్రిమ మేధస్సుపై...



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గ్లోబల్ తయారీ, హరిత శక్తి, ఉద్యోగాలపై కృత్రిమ మేధస్సు ప్రభావం, యువతకు నైపుణ్యాభివృద్ధి మరియు పునర్నైపుణ్య కార్యక్రమాలు వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అడోబ్ సంస్థ ప్రధాన కార్యనిర్వాహక అధికారి మరియు తెలంగాణ రైజింగ్--2047 దూరదృష్టి మండలి సభ్యుడు శంతను నారాయణ్తో విస్తృతంగా చర్చించారు.హైదరాబాద్‌లో జరిగిన ఈ మర్యాదపూర్వక సమావేశంలో ప్రపంచవ్యాప్తంగా తయారీ, సాంకేతిక రంగాల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, అభివృద్ధి అవకాశాలు మరియు వాటిని రాష్ట్రానికి అనుకూలంగా మలచుకునే విధానాలపై సమగ్రంగా చర్చ జరిగింది. ఆయా రంగాల్లో తెలంగాణను ముందంజలో నిలబెట్టేందుకు ప్రభుత్వం చేపట్టాల్సిన వ్యూహాత్మక చర్యలపై అభిప్రాయాలు పంచుకున్నారు.

తయారీ రంగంలో తెలంగాణను శక్తివంతమైన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు అవసరమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. దేశీయ, అంతర్జాతీయ ప్రముఖ సంస్థలను ఆకర్షించేందుకు అనుకూల పారిశ్రామిక వాతావరణం, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, ఆధునిక మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. కృత్రిమ మేధస్సు రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఆర్థిక వ్యవస్థపై చూపనున్న ప్రభావం, రాబోయే రోజుల్లో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమావేశంలో చర్చించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా సాంకేతిక రంగంలో మరింత సహకారం అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శంతను నారాయణ్‌ను కోరారు.

### ఉగ్రవాదానికి వ్యతిరేకంగా
## ఇజ్రాయెల్ పోరాటానికి భారత్ మద్దతు

- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యం
- ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో భారత ప్రధాని మోడీ ప్రసంగం
- ప్రధాని మోడీకి 'స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ పతకం ప్రదానం



**బలగం టీవి, జెరూసలేం**

రెండు రోజుల ప్రభుత్వ పర్యటనలో భాగంగా ఇజ్రాయెల్ చేరుకున్న భారత ప్రధానమంత్రి మోడీ, ఇజ్రాయెల్ పార్లమెంట్ లో చారిత్రాత్మక ప్రసంగం చేశారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నేతాన్యాహు సమక్షంలో ఉగ్రవాదంపై భారత్ దృఢమైన వైఖరిని స్పష్టంగా వెల్లడించారు.ఇజ్రాయెల్ పార్లమెంట్‌ను ఉద్దేశించి భారత ప్రధానమంత్రి చేసిన ఇది తొలి ప్రసంగం కావడం విశేషం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఇజ్రాయెల్ చేపడుతున్న పోరాటంలో భారత్ సంపూర్ణ మద్దతుతో నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

**హమాస్ దాడి -- ముంబై 26/11 ఘటనకు పోలిక**

అక్టోబర్ 2023లో హమాస్ నిర్వహించిన దాడిలో సుమారు 1,200 మంది మరణించగా, ముంబైలో జరిగిన 26/11 ఉగ్రదాడిలో దాదాపు 175 మంది ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ప్రధాని ప్రస్తావించారు. "మీ బాధ మా బాధే. మీ దుఃఖాన్ని మేము పంచుకుంటున్నాం. ఈ క్లిష్ట సమయంలోనే కాక భవిష్యత్తులో కూడా భారత్ ఇజ్రాయెల్‌తో అచంచలంగా నిలుస్తుంది," అని పేర్కొన్నారు.మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఈ ప్రాంతంలో నాలుగు వేల మందికి పైగా భారత సైనికులు ప్రాణత్యాగం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. 1918 సెప్టెంబర్‌లో హైఫాలో జరిగిన గుర్రపు దళ దాడి సైనిక చరిత్రలో విశిష్ట అధ్యాయమని వివరించారు.

**మైత్రి శక్తి పెంపుకు దోహదం: నెతన్యాహు**

ప్రధాని ప్రసంగానికి ముందు నెతన్యాహు మాట్లాడుతూ భారత్-ఇజ్రాయెల్ సంబంధాల చారిత్రక లోతును వివరించారు. సింధు లోయ నాగరికత, జోర్డాన్ లోయ నాగరికతల మధ్య ఉన్న సాంస్కృతిక అనుబంధాన్ని ప్రస్తావించారు. "మన మధ్య ఉన్న కూటమి రెండు దేశాల శక్తిని మరింతగా పెంచే గుణకార శక్తి వంటిది. ఇది ఆత్మబలం, కార్యాచరణ, సామర్థ్యాలను విస్తరింపజేస్తుంది," అని ఆయన పేర్కొన్నారు.2017లో ప్రధాని మోదీ చేసిన తొలి ఇజ్రాయెల్ పర్యటనను స్మరించుకుంటూ మధ్యధరా సముద్ర తీరంలో కలిసి నడిచిన సందర్భాన్ని ఆయన గుర్తుచేశారు.

2017 పర్యటన సందర్భంగా ఇరు దేశాలు సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లిన విషయాన్ని మోదీ ప్రస్తావించారు. గత కొన్నేళ్లుగా శాస్త్ర సాంకేతికం, ఆవిష్కరణ, రక్షణ, భద్రత, వ్యవసాయం, జలవనరుల నిర్వహణ, వాణిజ్యం, సాంస్కృతిక రంగాల్లో సహకారం విస్తరించిందని తెలిపారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కాగా, ఇజ్రాయెల్ సాంకేతిక ఆవిష్కరణల్లో ముందంజలో ఉందని, ఈ రెండు దేశాల భాగస్వామ్యం సహజసిద్ధమని పేర్కొన్నారు. వాణిజ్యాన్ని విస్తరించడం, పెట్టుబడులను పెంపొందించడం, మౌలిక వసతుల అభివృద్ధిలో సంయుక్త కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. భారత్--మధ్యప్రాచ్యం--యూరప్ ఆర్థిక కారిడార్ ప్రణాళికను కూడా ఆయన ప్రస్తావించారు. ఇది కొత్త రవాణా మార్గాలు, ఇంధన పైపులైన్లు, దూరసంప్రేషణ మౌలిక వసతుల అభివృద్ధికి దోహదం చేస్తుందని వివరించారు. కాగా, ఇజ్రాయెల్ పార్లమెంట్ ప్రధాని నరేంద్ర మోదీకి 'స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ పతకాన్ని' ప్రదానం చేసింది.

## ఘనంగా యాదగిరీశుడి కల్యాణ మహోత్సవం

- ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్



**బలగం టీవి, యాదగిరిగుట్ట**

లోకక్షేమం, లోకశాంతి కోసం నిర్వహించిన యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుకల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్వయంభూ దేవుడైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో జరిగిన ఈ మహోత్సవం భక్తజనులకు కన్నులపండువగా నిలిచింది. బుధవారం నిర్వహించిన తిరుకల్యాణ మహోత్సవాన్ని శ్రీపాంచరాత్రా గమ శాస్త్ర విధానానుసారం వేదమంత్రో చ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీరామావతారంలో హనుమంత వాహన సేవలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.రాత్రి నిర్ణీత సుముహూర్తంలో శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. వధూవరులుగా అలంకరించిన శ్రీనారసింహుడు, అమ్మవారిని గజవాహనంపై మేళతాళాల మధ్య ఆలయ పురవీధుల్లో ఊరేగించి రాత్రి కల్యాణ మండపానికి తీసుకువచ్చి కొలువుదీర్చారు.కల్యాణమూర్తులకు ప్రభుత్వం తరఫున మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావు, జిల్లా పోలీసు అధికారి ఆకాంక్ష్ యాదవ్ తదితరులు కూడా పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామివారి తిరుకల్యాణాన్ని దర్శించుకొని తృప్తి పొందారు.

## తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు

- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి పొంగులేని శ్రీనివాస్ రెడ్డి
- రెవెన్యూ శాఖ ఉన్నతాధికా రులతో సమీక్ష

వివరాలు 2వ పేజీలో

## నల్గొండ జిల్లాలో నకిలీ వైద్యుల అరెస్టు

- మిర్యాలగూడలో ఐదు కంటి ఆస్పత్రుల్లో నకిలీ వైద్యులు

వివరాలు 2వ పేజీలో

## బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య



**బలగం టీవి, నిర్మల్**

నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో బుధవారం విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. దాంతో ట్రిపుల్ ఐటీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈసీఈ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బుధవారం ఉదయం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని ట్రిపుల్ ఐటీ కళాశాల అధికారులు మధ్యాహ్నం వరకు బయటకు పొక్కకుండా చూశారు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఆస్పత్రికి తరలించారు. వనపర్తి జిల్లాకు చెందిన వసంత(21) వ్యక్తిగత సమస్యలతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు తెలిపారు. విద్యార్థిని రెండు రోజులుగా ముభావంగా ఉంటున్నట్టు తోటి విద్యార్థులు చెబుతున్నారు. విద్యార్థిని ప్రేమించిన యువకుడు ఆత్మహత్య చేసుకోవటంతో ఈమె కూడా ఆత్మహత్యకు పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కోణంలోనే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమా? మరేదైనా కారణమా? అనేది పోలీసుల దర్యాప్తులో తేలనుంది. విద్యార్థిని గొంతుపై గాయాలుండటంతో ఆత్మహత్యపై అనుమానాలున్నాయని విద్యార్థులు సాయంత్రం యూనివర్సిటీ వీసీ ఛాంబర్‌ను ముట్టడించారు. మృతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

### గాంధీ ఆస్పత్రిలో తొలిసారి
## ఐవీఎఫ్ పద్ధతిలో శిశువు జననం



- ప్రభుత్వాస్పత్రిలో ఐవీఎఫ్‌తో తొలి ప్రసవం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో తొలిసారి ఐవీఎఫ్ పద్ధతిలో ఓ మహిళ తన బిడ్డకు జన్మనిచ్చింది. ఆస్పత్రి మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా ప్రసవం చేశారు. తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు వివరాలను వెల్లడించారు. 'ప్రయివేటు ఆస్పత్రుల్లో రూ.లక్షలు ఖర్చయ్యే ఈ ఐవీఎఫ్ చికిత్సను రాష్ట్ర ప్రభుత్వం గాంధీ హాస్పిటల్‌లో ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. నగరానికి చెందిన శృతి, శ్రీకాంత్‌కు ఏడేండ్ల క్రితం వివాహమైంది. పిల్లల కోసం పలు ప్రయివేటు ఫెర్టిలిటీ సెంటర్లను ఆశ్రయించగా, డబ్బులు ఖర్చయ్యాయి తప్పితే ఫలితం కన్పించలేదు. ఐయూఐ ప్రయత్నాలతో సన్నిహితుల సూచన మేరకు ఆ దంపతులు 2024 అక్టోబర్‌లో గాంధీ ఆస్పత్రిలో సంతాన సాఫల్య కేంద్రానికి వచ్చారు. ఇన్‌ఫెర్టిలిటీ పనులు మొదలు పెట్టిన వైద్యులు పలు రకాల వైద్య పరీక్షలు, స్కానింగ్స్‌తో పాటు వైద్యసేవలు, సలహాలు, సూచనలు అందించారు. అయినా ఎలాంటి స్పందన లేకపోవడంతో ప్రయివేటు ఫెర్టిలిటీ సెంటర్‌లో ఇంట్రాయుటెరైన్ ఇన్సెమినేషన్ (ఐయూఐ) ఫెయిలైందని తెలుసుకున్న వైద్యులు ఇన్విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) చికిత్స అందించారు. గతేడాది మే 2న ఓపీయూఎం, జూన్ 30న ఎఫ్ఈటీ జరిగింది. ఈ ప్రయత్నం విజయవంతం కావడంతో ఈ నెల 7న పండంటి శిశువుకు ఆమె జన్మనిచ్చారు. ఆమె బిడ్డకు జన్మనిచ్చే వరకు వైద్యులు నిశితంగా పరిశీలించారు. ఆమెకు ముందస్తు ప్రసవం ప్రారంభం కావడంతో ఈ నెల 7న రాత్రి 10 గంటలకు అత్యవసర ఎల్ఎస్‌సీఎస్ జరిగింది. 2 కిలోల బరువున్న ఆడ శిశువు జన్మించింది. అకాల ప్రసవం దష్ట్యా పర్యవేక్షణ కోసం శిశువును ఎన్ఐసీయూకి తరలించారు. ఆ తర్వాత పీడియాట్రిక్స్ పర్యవేక్షణలో తల్లి వద్ద ఉంచారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ బాగానే ఉన్నట్టు గాంధీ వైద్యులు తెలిపారు. గురువారం(నేడు) తల్లీబిడ్డలను డిశ్చార్జి చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇది తెలుగు రాష్ట్రాల్లోనే ప్రభుత్వ సెక్టార్‌లో ఐవీఎఫ్ ద్వారా విజయవంతమైన మొదటి కేసు కావడం గమనార్హం. కాగా 'గాంధీ' ఆస్పత్రి సంతాన సాఫల్య కేంద్రంలో మొత్తం 43 మంది శాంపిల్స్ సేకరించి, 17 మందికి ఐవీఎఫ్ చికిత్స విధానం ప్రారంభించగా ఏడుగురిలో పాజిటివ్ రిజల్ట్ వచ్చినట్టు తెలిసింది.

గాంధీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరేందర్‌కుమార్ మాట్లాడుతూ గాంధీ ఐవీఎఫ్‌లో ప్రసవం జరిగిన తల్లి బిడ్డలిద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఐవీఎఫ్ ప్రారంభం కావడం శుభ పరిణామం అని తెలిపారు. ప్రభుత్వం నాలుగు ఐవీఎఫ్ సెంటర్లను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ఉందనీ, అందులో భాగంగా 2024లో రెండు సెంటర్లను ప్రారంభించినట్టు చెప్పారు. అక్టోబర్‌లో గాంధీ హాస్పిటల్, డిసెంబర్‌లో ప్లేట్లబుర్జు హాస్పిటల్‌లో ఏర్పాటు చేశారు. ఇలాంటి విజయాలు ప్రభుత్వం, ప్రభుత్వ వైద్యుల మీద నమ్మకాన్ని తీసుకొస్తాయని తెలిపారు.

## పసిపాప హంతకులకు అండగా నిలిచే ప్రతి ఒక్కరూ దోషులే

- బాధిత కుటుంబానికి రూ.10 లక్షలతో ఇల్లు నిర్మించి ఇస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కుమ్మెర ఘటనలో మృతిచెందిన పసిపాప కుటుంబానికి పరామర్శ
- తక్షణంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం



**బలగం టీవి, నాగర్‌కర్నూల్**

జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దాడిలో మృతి చెందిన రెండు నెలల పసిపాప కుటుంబాన్ని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని, రూ.10 లక్షలతో ఇల్లు నిర్మించిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న వివిధ వర్గాల నాయకులు, కార్యకర్తలను కలిసి సంఘీభావం తెలిపారు. కుమ్మెరలో జరిగిన ఈ ఘటన తెలంగాణ సమాజం తలదించుకునే దుర్మార్గమైన సంఘటన అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పసిపాప హంతకులకు అండగా నిలిచే ప్రతి ఒక్కరూ దోషులేనని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అయినా, స్థానిక ప్రజాప్రతినిధులు అయినా హంతకులకు మద్దతుగా నిలబడటం తప్పేనని అన్నారు. హంతకులు ఎవరైనా, ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. దాడిలో పాల్గొన్న ఎనిమిది మందిపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పసిపాపను హత్య చేసిన నిందితులకు కఠిన శిక్షలు విధించాలని, అవసరమైతే ఉరిశిక్ష అమలు చేయాలని, కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని బయటకు వదలరాదని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఇది రాజకీయాలు మాట్లాడే సందర్భం కాదని, కానీ, నెలల పసిపాపై చనిపోయినా న్యాయం చేయకుండా అమానుషంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. .పోలీసులకు జీతాలు ఇచ్చేది రాష్ట్ర ప్రజలు. రేవంత్ రెడ్డి కాదు, ఆయన తొత్తులు కాదన్నారు. కుమ్మెర మల్లన్న స్వామి జాతరలో దాడి జరిగిన తర్వాత వారు ఫిర్యాదు చేస్తే అది సరిగ్గా లేదని పోలీసులు కంప్లైంట్ తీసుకోలేదు. ఫిర్యాదు తీసుకోకుండా అధికార పార్టీ నాయకులకు ఫోన్ చేసి వాళ్ల కంప్లైంట్ చేశారని, మీరు కౌంటర్ కంప్లైంట్ చేయండని చెప్పారన్నారు. పోలీసులు వేసుకున్న యూనిఫాంకి గౌరవం ఇవ్వకుండా, చేస్తున్న ఉద్యోగానికి న్యాయం చేయకుండా అధికార పార్టీ నేతలను కాపాడడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బిడ్డకు పాలు ఇవ్వాల్సిన తల్లి ఖననం చేసి కన్నీళ్లు పెట్టుకుంటూ న్యాయం కోసం రోడ్డు మీద కూర్చుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ అధికార యంత్రాంగం ఈరోజు ఆ బిడ్డతో పాటు రాజ్యాంగాన్ని కూడా ఖననం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అమానవీయ ఘటనపై అసెంబ్లీలో సైతం గళం వినిస్తామని స్పష్టం చేశారు.

## చెవి నొప్పితో ఆస్పత్రిలో చేరిన యువకుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన



**బలగం టీవి, నిజామాబాద్**

నిజామాబాద్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. చెవి నొప్పితో ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన యువకుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే మరణానికి కారణమని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

వివరాల్లోకెళ్తే.. భీంగల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన గంగం అజయ్ ఫిబ్రవరి 24న చెవి నొప్పితో స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. పరీక్షించిన వైద్యులు శస్త్రచికిత్స అవసరమని సూచించారు. శస్త్రచికిత్సకు ముందు మత్తుమందు ఇవ్వగా, అనంతరం అజయ్ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు సమాచారం. మత్తుమందు అధిక మోతాదులో ఇవ్వడం వల్లే అజయ్ ప్రాణాలు కోల్పోయాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రిలో వెంటిలేటర్ సహా తగిన వైద్య సౌకర్యాలు లేవని కూడా వారు పేర్కొన్నారు. చేతికొచ్చిన కుమారుడు అకాల మరణం చెందాడని కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. మృతదేహాన్ని ఆసుపత్రి ఎదుటే దహనం చేస్తామని డీజిల్ డబ్బాతో హెచ్చరించడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది.

## అమెరికాకు స్వర్ణయుగం ఆరంభమైంది



- భారత్-పాక్ యుద్ధం నేనే ఆపా
- అక్రమ వలసలు తగ్గాయి
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**బలగం టీవి, వాషింగ్టన్**

అమెరికాకు స్వర్ణయుగం మళ్లీ ప్రారంభమైందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. దేశాన్ని మరింత శక్తివంతంగా, సుసంపన్నంగా తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. 2026 'రాష్ట్ర స్థితిగతుల' కార్యక్రమంలో ప్రసంగిస్తూ ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను సమర్థించారు.భారత్--పాకిస్థాన్ మధ్య యుద్ధ పరిస్థితులను తానే నివారించానని ట్రంప్ మరోసారి పేర్కొన్నారు. "అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలి పది నెలల్లోనే ఎనిమిది యుద్ధాలను అరికట్టాను. కంబోడియా--థాయ్‌లాండ్, పాకిస్థాన్--భారత్ మధ్య అణు యుద్ధం సంభవించే పరిస్థితి నెలకొంది. నా జోక్యం లేకపోతే కోట్లాది మంది ప్రాణాలు కోల్పోయేవారని పాకిస్థాన్ ప్రధానమంత్రి చెప్పారు," అని తెలిపారు.తాను అధికారంలో ఉన్నట్లయితే రష్యా--ఉక్రెయిన్ యుద్ధం జరిగేదే కాదని ఆయన వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య హింసను ఆపేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఇరాన్ అణు, క్షిపణి సామర్థ్యాలను పెంపొందించుకునే ప్రయత్నాలు చేస్తున్నదని ట్రంప్ ఆరోపించారు. ప్రపంచంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశానికి అణు ఆయుధాలు ఉండటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని హెచ్చరించారు.దౌత్యపరమైన పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తానని చెప్పినా, అవసరమైతే కఠిన నిర్ణయాలకు వెనుకాడబోనని స్పష్టం చేశారు. యూరప్‌తో పాటు విదేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకునే క్షిపణులు ఇప్పటికే అభివృద్ధి చేశారని, త్వరలో అమెరికాను చేరుకునే సామర్థ్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు.గత తొమ్మిది నెలల్లో అక్రమ వలసలు గణనీయంగా తగ్గాయని ట్రంప్ పేర్కొన్నారు. చట్టబద్ధంగా దేశంలోకి వచ్చే వారికి అనుమతి ఉంటుందని, అక్రమ ప్రవేశాలను కట్టడి చేశామని చెప్పారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను కూడా నియంత్రించామని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో అధిక ద్రవ్యోల్బణం నెలకొనగా, తమ పాలనలో అది కనిష్ఠ స్థాయికి తగ్గిందని చెప్పారు. పెట్టుబడులు గణనీయంగా పెరిగాయన్నారు.

మిగితా 2వ పేజీలో

## రాష్ట్రంలో దిగజారుతోన్న శాంతిభద్రతల పరిస్థితి

**డీజీపీ శివధర్ రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆధ్వర్యంలో ఫిర్యాదు**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో శాంతిభద్రతల పరిస్థితి దిగజారుతోందని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ నేతలు రాష్ట్ర పోలీసు ప్రధానాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో బిజెపి ప్రతినిధి బృందం డీజీపీ శివధర్ రెడ్డిను కలిసి ఫిర్యాదు చేసింది.ఈ బృందంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. గౌతం రావు, వేముల అశోక్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రంలో కామారెడ్డి జిల్లా బాన్సువాడ, కామారెడ్డి పట్టణం, అలాగే నిజామాబాద్ జిల్లా రుద్రూర్ ప్రాంతాల్లో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో చట్టసువ్యవస్థ క్షీణించిందని బిజెపి పేర్కొంది. ఈ సంఘటనలపై నిష్పక్షపాత విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పార్టీ కార్యకర్తలపై నమోదు చేసిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని కోరింది.

డీజీపీని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు రాష్ట్రంలో మత ఘర్షణ వాతావరణం నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. బాన్సువాడలో ఒక యువతిపై జరిగిన దాడి ప్రయత్నం ఉద్రిక్తతకు దారితీసిందని పేర్కొన్నారు. ఆ ఘటనకు నిరసనగా నిర్వహిఒచిన బంద్ సందర్భంలో ప్రధానంగా బిజెపి కార్యకర్తలనే లక్ష్యంగా చేసుకుని పోలీసులు అరెస్టులు చేశారని ఆరోపించారు. సుమారు 27 మందిని జైలుకు పంపడమే కాకుండా మరికొందరిని పరారీలో ఉన్నట్లుగా చూపిస్తూ కుటుంబాలను వేధిస్తున్నారని

మిగితా 2వ పేజీలో

## రైతన్నల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు హరీష్‌రావు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రైతుల కన్నీళ్లతో పునాదులు నిర్మించుకున్న ఏ ప్రభుత్వమూ చరిత్రలో మనుగడ సాగించలేదని మాజీ మంత్రి, సిద్ధిపేట శాసనసభ్యుడు టి హరీష్‌రావు అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నల ఉసురు పోసుకుంటోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్ల కోసం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోయాయని విమర్శించారు. పాలకుల విలాసాలకు, పెద్ద కాంట్రాక్టర్ల కమిషన్లకు ప్రజాధనాన్ని నీళ్లలా ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. ఫిబ్రవరి 4న మిర్యాలగూడలో నిర్వహించిన బహిరంగ సభలో మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమ చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికే నిధులు సిద్ధంగా ఉన్నాయని చెప్పినా, ఎన్నికల నియమావళి ముగిసి పది రోజులు దాటినా రైతుబంధుపై స్పష్టత లేకపోవడం విచారకరమన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కూడా రైతుబంధు అంశం ప్రస్తావనకే రాలేదని తెలిపారు.

ఎన్నికల ముందు ఎకరానికి రూ.15 వేల సహాయం అందిస్తామని చెప్పి రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఇప్పటికే రెండు పంటకాలాలకు రైతుబంధు చెల్లింపులు నిలిపివేశారని పేర్కొన్నారు. ఓట్ల కోసం మాత్రమే రైతుబంధు పేరుతో నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. రైతులకు నిధులు లేవని చెబుతూ, మూసీ నది సుందరీకరణకు,

మిగితా 2వ పేజీలో

# తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు

- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి పొంగులేని శ్రీనివాస్ రెడ్డి
- రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించాలనే ఉద్దేశంతో తహసీల్దార్ మరియు ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొంగులేని శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరికాదని, ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి తెలిపారు.

మొదటి దశలో ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు సకల వసతులతో శాశ్వత భవనాలు నిర్మించనున్నారు. రెండో దశలో శిథిలావస్థలో ఉన్న 170 కార్యాలయాలను పునర్నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాలను ఒకే నమూనాలో, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా రూపకల్పన చేయాలని సమావేశంలో చర్చించారు.

స్టాంపులు మరియు నమోదుశాఖలో అత్యాధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి వెల్లడించారు. గచ్చిబౌలి, మేడ్చల్, పఠాన్ చెరువు ప్రాంతాల్లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, గచ్చిబౌలిలో పనులు తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు. మరికొద్ది నెలల్లో ఆ భవనం ప్రారంభానికి సిద్ధమవుతుందని పేర్కొన్నారు.గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాలను విభజించడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన సిబ్బందిని కేటాయించి రెవెన్యూ సేవలను బలోపేతం చేసినట్లు మంత్రి వివరించారు.తక్కువ వ్యయంతో ప్రజలకు ఉత్తమ సేవలు అందేలా వ్యవస్థను ఆధునీకరించేందుకు చర్యలు చేపడుతున్నామని, రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రతి సామాన్యుడికి గౌరవప్రదమైన పాలన, వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# రైతన్నల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

భూసేకరణకు, రహదారుల నిర్మాణానికి వేల కోట్లు కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. ఒకే ఆర్థిక సంవత్సరంలో పెద్ద కాంట్రాక్టర్లకు కమిషన్ల కోసం రూ.25 వేల కోట్ల బిల్లులు చెల్లించారని ఆరోపించారు. ఢిల్లీ పెద్దలకు నిధులు

పంపేందుకు వేల కోట్లు ఉంటే, కష్టాల్లో ఉన్న రైతులకు రైతుబంధు ఇవ్వడానికి మాత్రం నిధులు లేవా? అని నిలదీశారు.

ఇనుప కంచెలు లేని ప్రజాపాలన అని చెప్పుకుంటూనే ముఖ్యమంత్రి నివాస ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో వందల కోట్లతో ప్రాసాదం తరహా శిబిర కార్యాలయం నిర్మిస్తున్నారని విమర్శించారు. ఆ కార్యాలయం చుట్టూ ఇనుప కంచెల ఏర్పాటు కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. పక్కనే క్రీడా మైదానం నిర్మాణానికి కూడా భారీ వ్యయం చేస్తున్నారని ఆరోపించారు. అందాల పోటీలు, క్రీడా కార్యక్రమాలకు వందల కోట్లు వెచ్చిస్తూ అన్నంపెట్టే రైతన్నను విస్మరిస్తున్నారని అన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఓట్ల కోసం నాటకాలు ఆపి రైతులందరికీ రైతుబంధు నిధులు విడుదల చేయాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో దిగజారుతోన్న శాంతిభద్రతల పరిస్థితి

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. కామారెడ్డిలో బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి శిబిర కార్యాలయంపై ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలు దాడి చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఈ ఘటనలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారని తెలిపారు.

నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో మహిళా న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తూ, చట్టసువ్యవస్థ బలహీనతకు ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు.అలాగే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బార్కాస్, సఫిల్‌గూడ, ముత్యాలమ్మ ఆలయం, కీసర హనుమాన్ ఆలయం వంటి పలు ప్రాంతాల్లో ఆలయాలపై జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ, వీటి వెనుక ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ పూర్తిగా ప్రభుత్వ బాధ్యతేనని, ఈ అంశాలపై డీజీపీ సానుకూలంగా స్పందించి సమగ్ర విచారణ చేపడతామని హామీ ఇచ్చారని రాంచందర్ రావు తెలిపారు.

# అమెరికాకు స్వర్ణయుగం ఆరంభమైంది

(మొదటి పేజీ తరువాయి)

శక్తి వనరుల దిగుమతులు కూడా పెరిగాయని వివరించారు. వెనెజువెలా అధ్యక్షుడు చీఱఏశీశ్రీం మీుంబతీశ నిర్బంధం అనంతరం ఆ దేశం నుంచి పెద్దఎత్తున చమురు దిగుమతి అయినట్లు తెలిపారు.

ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దురదృష్టకరమని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే అనేక దేశాలు అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలను కొనసాగించాలని కోరుకుంటున్నాయని చెప్పారు.విదేశీ సుంకాల ద్వారా ఆదాయపు పన్ను భారం తగ్గించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' ద్వారా అమెరికన్లకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఈ చర్యలను వ్యతిరేకించిన ప్రతిపక్ష డెమొక్రాట్లను ఆయన తీవ్రంగా విమర్శించారు.

# ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు 96.90 శాతం మంది హాజరు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సెకెండ్ లాంగ్వేజ్ పేపర్ 1 పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్ష రాసేందుకు 5,14,598 మంది అర్హులుకా గా, 4,98,695 (96.90 శాతం) మంది హాజర య్యారు. 15,903 మంది గైర్హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. ఈ పరీక్షా సమయం ప్రారంభమయ్యాక 5 నిమిషాలు ఆలస్యం గా వచ్చిన వారిని లోపలికి అనుమతించారు. పరీక్ష ప్రారంభానికి ముందు తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి కష్ణ ఆదిత్య సికింద్రాబాద్, మారేడ్‌పల్లి ప్రాంతాల్లో పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై సిబ్బందితో మాట్లాడారు. పరీక్షలు సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జారీ చేసిన మార్గదర్శకాల అమలును ఆయన సమీక్షించారు. సికింద్రాబాద్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్, సెయింట్ ఫ్రాన్సిస్ జూనియర్ కాలేజ్ ఆఫ్ గర్ల్స్, సెయింట్ మేరీస్ సెంచనరీ జూనియర్ కాలేజ్, మారేడ్‌పల్లిలోని ఎంఆర్ఎం ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్, ఎక్సలెన్షియా జూనియర్ కాలేజ్ కేంద్రాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లపై కార్యదర్శి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షలన్నీ పూర్తయ్యే వరకు ఇవే ప్రమాణాలను కొనసాగించాలని ఆయన అధికారులకు సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌తో పాటు జనగాం, సూర్యా పేట, నల్లగొండ, నిజామాబాద్, సిరిసిల్ల, భూపాలపల్లి, వరంగల్, కరీంనగర్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ములుగు, మెదక్, ఖమ్మం, యాదాద్రి జిల్లాల్లోని కేంద్రాలను పరీక్షల అబ్జర్వర్లు సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్ష సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. చివరి నిమిషంలో పరిగెత్తుకుంటూ వెళ్లవద్దనీ, ఒత్తిడికి గురి కాకుండా మిగిలిన పరీక్షలకు అరగంట ముందుగానే వెళితే మంచిదని అధికారులు విద్యార్థులకు సూచించారు.

# నల్గొండ జిల్లాలో నకిలీ వైద్యుల అరెస్టు

**బలగం టీవీ, మిర్యాలగూడ**

నల్గొండ జిల్లాలో మరోసారి నకిలీ వైద్యుల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ పట్టణంలో అర్హతలు లేకుండా వైద్యులుగా కొనసాగుతున్న పలువురిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఐదు కంటి ఆసుపత్రుల్లో కంటి నిపుణులుగా పనిచేస్తున్నట్లు చెప్పుకుంటున్న వారిని వైద్య మండలి అధికారులు, పోలీసుల సహకారంతో పట్టుకున్నారు. ఇటీవల తెలంగాణ వైద్య మండలి నిర్వహించిన తనిఖీల్లో నకిలీ వైద్యుల అక్రమాలు బయటపడ్డాయి. బాధిత మహిళతో పాటు మండలి సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టారు. అర్హతలు లేకుండా వైద్యం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

గతంలోనూ 2025 మే నెలలో నల్గొండ జిల్లాలో నకిలీ వైద్యులను గుర్తించి కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. వైద్య మండలి సభ్యులు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి నకిలీ వైద్యుల గుట్టు రట్టు చేశారు. కాంపౌండర్లుగా పనిచేసి ఆర్ఎంపీ ధృవపత్రాలు సంపాదించి వైద్యుల వేషంలో ప్రజలను మోసం చేస్తున్న వారిపై 14 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వైద్యులు డాక్టర్ లాలయ్య కుమార్, డాక్టర్ మహేష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసులు నమోదు చేసినట్లు తెలంగాణ వైద్య మండలి ఉపాధ్యక్షుడు జి. శ్రీనివాస్ వెల్లడించారు.

# ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువజనోత్సవాల గోడ పత్రిక విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశం కోసం ప్రాణాలర్పించిన షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా యువజనోత్సవాలను (స్టాప్ డ్రగ్స్ –స్టాప్ స్పోర్ట్స్, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు,వ్యాసరచన, చిత్రలేఖన,ఉపన్యాస పోటీలు, రక్తదాన శిబిరాలు,యువ కవి, గాయకుల సమ్మేళనం,సాంస్కృతిక కార్యక్రమాలు,ప్రముఖుల సందేశాలు) మార్చ్ 1–23 వరకు నిర్వహించనున్నామని, ఈ వర్ధంతికి సంబంధించిన గోడ పత్రికను హిమాయత్ నగర్ లోని సత్య నారాయణ రెడ్డి భవన్ లో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర. లు మాట్లాడుతూ. షహీద్ భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్ దేవ్ లు దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యలను సైతం లెక్కచేయకుండా, భవిష్యత్తు తరాల కోసం బ్రిటీష్ ముష్కరులను ఎదిరించి వీరోచిత పోరాటాలు చేసి వీరమరణం పొందరన్నారు. కానీ, భగత్ సింగ్ కలలుగన్న స్వరాజ్య ఆకాంక్షలకు అనుగుణంగా నేటి విద్యార్థులు,యువత పయనుంచడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దేశానికే ఆదర్శప్రాయుడైన భగత్ సింగ్ స్ఫూర్తితో నేటి యువత చెడు మార్గాలను,చెడు అలవాట్లను విడనాడాలని వారు పిలుపునిచ్చారు. కుల,మతాలకు అతీతంగా ధనిక, పేద తారతమ్యాలు లేని, అవినీతి రహిత సమసమాజ స్థాపన కలలుకన్నాడని వారు అన్నారు. మతోన్మాద ముక్త భారతం సాధించడానికి భగత్ ఆలోచనలు, ఆయన చూపిన కార్యచరణ, మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్ కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్,ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బిజ్జ శ్రీనివాసులు, టి.సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, యుగంధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ మహమూద్, సల్మాన్ బేగ్, పి.శివ కుమార్, ఎల్లంకి మహేష్,మార్కపూరి సూర్య, మానస్ కుమార్, సురేందర్,మస్కు సుధీర్, వెంకటేష్, మధుకర్, జెట్టి శ్రీను,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మెర ఘటనకు కారణమైన హంతకులను అరెస్టు చేయాలి

- కుటుంబానికి భరోసా కల్పించి ఆర్థికంగా కుటుంబాన్ని ఆదుకోవాలి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ భూపాల్

**బలగం టీవీ, హైదరాబాద్**

నాగర్ కర్నూల్ జిల్లాలో కుమ్మెర జాతర సందర్భంగా జరిగిన ఒక కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ గ్రామ పెత్తందారులు ఆ కుటుంబం పట్ల అనుసరించిన తీరు సమాజాన్ని తలదించుకునే విధంగా ఉందని రెండు నెలల పసికందు మరణానికి కారకులైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన 8 మందిని వెంటనే అరెస్టు చేయాలని బాధిత కుటుంబానికి భరోసా కల్పించి ఆర్థికంగా సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితుల కుటుంబాన్ని పరామర్శిస్తూ వారి కుటుంబానికి అండగా ఉంటామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ భూపాల్ ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడటం జరిగింది ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ భూపాల్ మాట్లాడుతూ కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా అమానవీయంగా కాలితో తన్ని హత్య చేసిన ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులు మధుసూదన్ రెడ్డి సతీష్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి కన్నిరెడ్డి మరికొందరిపై ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంతోపాటు హత్యా నేరం కింద కేసు నమోదు చేసి తక్షణమే రిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు

మల్లన్న జాతర పండగలు ఉత్సవాలలో కులవివక్ష అగ్రకుల దురహంకారంతో ప్రజల మధ్య కులవిద్వేషాలు సృష్టంచడం, దేవుడి దగ్గర అందరూ సమానము కాదని అహంకారము ప్రదర్శించడంవల్ల ఈ ఘటన జరిగిందన్నారు. దేవుని దగ్గరికి వెళ్లడానికి 100 రూపాయలు ఫీజు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించిన పాపానికి, చెల్లిస్తాం కానీ రశీద్ ఇవ్వండని అడిగినందుకు సుమారు మూడున్నర గంటలపాటు గణేష్ అనే యువకుడిని చితక బాధారని చెప్పారు. తన భర్తను కొట్టవద్దని తన తమ్ముడిని కొట్టవద్దని గణేష్ అక్క కీర్తి భార్య మౌనిక ఎంతగా బ్రతిమిలాడిన కాళ్లు మొక్క డానికి ప్రయత్నం చేసిన కాళ్లతో తన్నారు తప్ప కనికరించలేదు రెండు నెలల పసిబిడ్డ ఉంది నా భర్తను కొట్టకండి చంపకండి అని వేడుకున్న చివరికి ఏమాత్రం కనికరం లేకుండా అమానవీయంగా మానవ మృగంలా రెండు నెలల పసిబిడ్డపై కూడా కాలితో తన్ని క్రూరంగా పసిబిడ్డను హత్య చేశారని చెప్పారు ఈ ఘటన సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా మానవత్వాన్ని మంటగలిపే విధంగా ఉందన్నారు సంఘటన ఈ నెల 18న జరిగితే పోలీసులు బాధితులే అగ్రకుల పెత్తందారులపైన దాడి చేసినట్లుగా బాధితులపై కేసులు నమోదు చేయడం సిగ్గుచేటు అన్నారు బాధితులను వెంటబడి వెంబడించి దాడి చేసి చెప్పరాని బూతులు తిట్టి కాలుతో తన్ని పసిబిడ్డను హత్య చేసిన హంతకులను మాత్రం పోలీసులు ఒక కంటకనిపెట్టారని చెప్పారు చట్టం ముందు అందరూ సమానులే అని చెప్పే పోలీసులు హంతకులకు న్యాయం బాధితులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ పుప్పాల శ్రీకాంత్ ఉపాధ్యక్షులు పద్మశ్రీ పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధన్ పర్వతాలు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు సహాయ కార్యదర్శి పొదిల రామయ్య కొంపల్లి అశోక్ మధు తారా సింగ్ వెంకటేష్ మల్లికార్జున్ వెంకటస్వామి బాలస్వామి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

# మొబైల్ బాధితులకు ఊరట.. 63 చోరీ ఫోన్లు రికవరీ

- రూ. 6 లక్షల విలువైన ఫోన్లను బాధితులకు అందజేసిన ఎస్పీ మహేష్ బి. గితే.
- సెల్ ఫోన్ పోతే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి.
- దొంగిలించిన ఫోన్లు కొంటే క్రిమినల్ కేసులు తప్పవు : ఎస్పీ హెచ్చరిక.



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మొబైల్ ఫోన్ల రికవరీలో రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ యంత్రాంగం అద్భుత ఫలితాలను సాధిస్తోంది. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోయిన, అలాగే చోరీకి గురైన సుమారు రూ. 6 లక్షల విలువ గల 63 మొబైల్ ఫోన్లను ఐటి కోర్ టీం రికవరీ చేసింది. ఈ ఫోన్లను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'మొబైల్ రికవరీ మేళా' ద్వారా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ అనేది కేవలం పరికరం మాత్రమే కాదని, అందులో బ్యాంక్ ఖాతాలు, వ్యక్తిగత సమాచారం వంటివి నిక్షిప్తమై ఉంటాయని పేర్కొన్నారు. మొబైల్ పోగొట్టుకున్న వెంటనే బాధితులు ఊఊ.ఊవఆఓ.స్త్రఓజ.ఆఆ పోర్టల్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ చేయాలని, తద్వారా ఫోన్ దుర్వినియోగం కాకుండా చూడవచ్చని సూచించారు. తక్కువ ధరకు వస్తున్నాయని దొంగిలించబడిన ఫోన్లు కొంటే చిక్కుల్లో పడతారని హెచ్చరించారు. సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనేటప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, దొంగతనపు ఫోన్లు అని తెలిసి కొనుగోలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ఆధునిక సాంకేతికతను ఉపయోగించి, పొరుగు రాష్ట్రాల నుండి సైతం ఫోన్లను వెలికితీసిన ఐటి కోర్ ఎస్.ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ రాజాతిరుమలేష్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పోయిన ఫోన్లు మళ్ళీ దొరుకుతాయని ఊహించలేదని, తమ ఫోన్లను అప్పగించిన పోలీసులకు బాధితులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ యాదగిరి మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జగిత్యాలలో అంబేద్కర్ విగ్రహం ఎత్తుకెళ్లిన ఘటన

- తాత్కాలికంగా విగ్రహం పునఃస్థాపన

**బలగం టీవీ, జగిత్యాల**

జగిత్యాల పట్టణంలోని హనుమాన్‌వాడ ప్రాంతంలోఅంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన కలకలం రేపింది. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు వెంటనే ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.సమాచారం అందుకున్న వెంటనే ఎమ్మెల్యే జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్‌కు ఫోన్ చేసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, అనుమానితులను విచారించారు. విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన వారిని గుర్తించి, అంబేద్కర్ విగ్రహాన్ని తాత్కాలికంగా పునఃస్థాపించారు. త్వరితగతిన స్పందించి పోలీసు శాఖను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా సత్తా

- 8 పతకాలతో మెరిసిన జిల్లా పోలీసులు
- విజేతలను అభినందించిన ఎస్పీ మహేష్ బి. గితే



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు తెలంగాణ రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో విశేష ప్రతిభ కనబరిచారు. ఫిబ్రవరి 16 నుండి 21 వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వేదికగా నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు మొత్తం 08 పతకాలు (04 బంగారు, 04 కాంస్య) సాధించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితేసంతోషం వ్యక్తం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో విజేతలకు పతకాలు అందజేసి అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ తెలిపారు. గెలుపోటములు సహజమని, విజేతలు జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వడానికి కృషి చేయాలని సూచించారు. ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**పతక విజేతలు**

లాన్ టెన్నిస్: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ మధుకర్ -- కాంస్య పతకం

బ్యాడ్మింటన్ మిక్స్డ్ డబుల్స్: డిసిఆర్‌బీ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు -- కాంస్య పతకం

టేబుల్ టెన్నిస్: ఏఆర్ఎస్ఐలు సత్యనారాయణ, ఆనంద్ -- కాంస్య పతకాలు

**కాయకింగ్:**

ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ సతీష్ -- 500 మీటర్ల సింగిల్, 500 మీటర్ల డబుల్స్, 200 మీటర్ల సింగిల్ విభాగాల్లో బంగారు పతకాలు

ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ గంగరాజు -- 500 మీటర్ల సింగిల్, 500 మీటర్ల డబుల్స్ విభాగాల్లో బంగారు పతకాలు

జిల్లా పోలీస్ క్రీడాకారుల ప్రతిభపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

- జిల్లా ఎస్పీ మహేష్ బి గితే క్షేత్రస్థాయి పరిశీలన...
- 163 బీఎన్ఎస్ఎస్ (సెక్షన్ 144) కచ్చితంగా అమలు చేయాలి.
- కేంద్రాల వద్ద గుమికూడితే కఠిన చర్యలు.
- పరీక్షా సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేత.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. బుధవారం సిరిసిల్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరును సమీక్షించి, విధుల్లో ఉన్న అధికారులకు మరియు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 పరీక్షా కేంద్రాల వద్ద 163 దీచీూా (సెక్షన్ 144) అమల్లో ఉంటుందని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ వెల్లడించారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్లు ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు కచ్చితంగా మూసివేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల పరిసరాల్లో ప్రజలు లేదా విద్యార్థుల తల్లిదండ్రులు గుంపులుగా ఉండకూడదని, పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎస్పీ వెంట సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మరియు ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వకుంటే ఉద్యమమే



- సీఎం రేవంత్ రెడ్డికి జర్నలిస్టులు కనిపించడం లేదా?
- గత ప్రభుత్వ పథకాలను ఎందుకు విస్మరిస్తున్నారు?
- మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ
- ప్రమాద బీమా సొమ్ము వెంటనే చెల్లించాలి : ఆస్కాని మారుతి సాగర్ డిమాండ్

**బలగం టీవీ, హైదరాబాద్:**

రాష్ట్రంలోని జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఘాటుగా స్పందించారు.

ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగుల హెల్త్ స్కీమ్ గురించి ప్రకటించిన ప్రభుత్వం, జర్నలిస్టుల ఊసే ఎత్తకపోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం జి.ఓ. 64 ద్వారా జర్నలిస్టులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందేలా చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సౌకర్యాలను కూడా తొలగిస్తోందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు మెరుగైన సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా జర్నలిస్టులకు ఒక్క పైసా కూడా విదిల్చలేదని విమర్శించారు. కొత్త పథకాలు ఇవ్వకపోగా, ఉన్న అక్రెడిటేషన్ కార్డులలో కోత విధించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

"తెలంగాణ సాధన కోసం 14 ఏళ్లు పోరాడాం. ఇప్పుడు జర్నలిస్టుల హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. మా దృష్టిలో జర్నలిస్టులు ఉన్నారా? లేరా? అనేది ముఖ్యమంత్రి స్పష్టం చేయాలి." అని అల్లం నారాయణ అన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలు చేసిన రూ. 5 లక్షల ప్రమాద బీమా (జి.ఓ. 22) ప్రీమియంను ప్రస్తుత ప్రభుత్వం రెన్యువల్ చేయకపోవడం దారుణమన్నారు. హోంగార్డులు, ఆటో డ్రైవర్లు, జర్నలిస్టులకు వర్తించే ఈ బీమాను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే నేతలు ఎ. రమణ కుమార్, పి. యోగానంద్, యార నవీన్ కుమార్, బాపు రావు, కడకంచి వెంకటేష్, లాయక్ పాషా తదితరులు పాల్గొని జర్నలిస్టుల ఐక్యతను చాటారు.



# అండగా మేమున్నాం

- దివంగత వేముల నాగేష్ కుటుంబానికి సర్పంచ్ భరోసా
- నాగేష్ కుమార్తె చదువుకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కేకే మహేందర్ రెడ్డి హామీ.
- దినకర్మ సందర్భంగా 50 కిలోల బియ్యం వితరణ చేసిన సర్పంచ్ రచన చోటు.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

అనారోగ్యంతో మరణించిన ఇందిరమ్మ కాలనీకి చెందిన వేముల నాగేష్ కుటుంబానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు అండగా నిలిచారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నాగేష్ పరిస్థితిని గతంలోనే గుర్తించిన సర్పంచ్ గడ్డం రచన చోటు, వార్డు సభ్యులు కొండ భరత్.. ఈ విషయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే, నాగేష్ చికిత్స నిమిత్తం LOC మంజూరు చేయించి వైద్య సహాయం అందించారు.

ఆపరేషన్ అనంతరం కోలుకుంటూ మళ్ళీ అనారోగ్య సమస్యతో నాగేష్ మరణించగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు భరోసానిచ్చారు. నాగేష్ కుమార్తె స్నేహ భవిష్యత్తు దెబ్బతినకుండా, ఆమె చదువులకు తాము పూర్తి అండగా ఉంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కె.కె. మహేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం కేసీఆర్ నగర్ (6వ వార్డు)లో నాగేష్ దినకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం రచన చోటు తన వంతు సాయంగా బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం వితరణ చేశారు. పేద కుటుంబానికి కష్టం వచ్చినప్పుడు ప్రజా ప్రతినిధులుగా అండగా ఉండటం తమ బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండ శ్రీకాంత్, వార్డు సభ్యులు కొండ భరత్, కుసుమ హేమంత్, గాజుల రాంప్రసాద్, ఖాజా, మల్లిఖార్జున, రమేష్, సతీష్, అంబటి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచకప్ నుంచి శ్రీలంక అవుట్

- శ్రీలంకపై 61 పరుగుల తేడాతో న్యూజిలాండ్ గెలుపు

**బలగం టీవీ, కొలంబో**

20–20 ప్రపంచకప్ సూపర్--8 దశలో జరిగిన కీలక పోరులో న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టు 61 పరుగుల తేడాతో శ్రీలంక జాతీయ క్రికెట్ జట్టును చిత్తు చేసింది. కివీస్ బ్యాటర్లు పోరాడదగ్గ స్కోరు సాధించగా, బౌలర్లు సమిష్టిగా రాణించి లంక బ్యాటింగ్ క్రమాన్ని కుదేలుచేశారు.




టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. కెప్టెన్ మిచెల్ సాంట్నర్ 47 పరుగులతో జట్టుకు బలమైన పునాది వేశారు. రచిన్ రవీంద్ర 32 పరుగులు, మెకాంచీ 31 పరుగులతో సహకరించారు. కీలక సమయాల్లో బౌండరీలు సాధిస్తూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. శ్రీలంక బౌలర్లలో మహీశ్ తీక్షణ, దుష్మంత చమీరా తలో మూడు వికెట్లు తీశారు. వెల్లాలగే ఒక వికెట్ సాధించాడు.



169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక ఆరంభం నుంచే ఒత్తిడిలో పడింది. కివీస్ బౌలర్ల స్వింగ్, లెంగ్త్‌ను అంచనా వేయడంలో లంక బ్యాటర్లు విఫలమయ్యారు. వరుసగా వికెట్లు కోల్పోతూ లక్ష్యాన్ని చేరుకునే దిశగా సాగలేకపోయారు. నిర్ణీత ఓవర్లు ముగిసే సరికి 107 పరుగులకే పరిమితమయ్యారు. లంక బ్యాటర్లలో కమిందు మెండిస్ 31, వెల్లాలగే 29 పరుగులు చేశారు. కివీస్ బౌలర్లలో రచిన్ రవీంద్ర నాలుగు వికెట్లు పడగొట్టి లంక నడ్డి విరిచాడు. మ్యాట్ హెన్రీ రెండు వికెట్లు సాధించగా, సాంట్నర్ ఒక వికెట్ తీశాడు.

**సెమీఫైనల్ రేసు నుంచి లంక నిష్క్రమణ**

ఈ ఓటమితో శ్రీలంక సెమీఫైనల్ అవకాశాలు ఆవిరయ్యాయి. సూపర్--8 దశలో వరుస పరాజయాలతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరోవైపు న్యూజిలాండ్ కీలక విజయాన్ని నమోదు చేసి సెమీస్ రేసులో బలమైన అడుగు వేసింది. గ్రూప్ సమీకరణాల ప్రకారం కివీస్ జట్టు ఇప్పుడు సెమీఫైనల్ దిశగా ముందడుగు వేసినట్లైంది.



## అన్నపూర్ణ స్టూడియోస్‌లో అత్యాధునిక మోషన్ క్యాప్చర్ ల్యాబ్ ఆవిష్కరణ

- భారతీయ సినీ పరిశ్రమకు కొత్త అధ్యాయం
- ప్రారంభించిన దర్శకుడు రాజమౌళి

**బలగం టీవీ, హైదరాబాద్**

భారతీయ సినీ పరిశ్రమలో సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ నగరంలోని అన్నపూర్ణ స్టూడియోస్లో అత్యాధునిక మోషన్ క్యాప్చర్ సదుపాయం ప్రారంభమైంది. కింగ్ అక్కినేని నాగార్జునకు చెందిన అన్నపూర్ణ స్టూడియోస్, నిర్మాత శోభు యార్లగడ్డ స్థాపించిన మిహిరా విజువల్ ల్యాబ్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రానికి "ఎ అండ్ ఎం మోకాప్ ల్యాబ్" అనే పేరు పెట్టారు. హాలీవుడ్‌కు చెందిన Animatrik Film Design సంస్థ ఈ ల్యాబ్‌కు సాంకేతిక సహకారం అందించింది.ఫిబ్రవరి 20న ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి చేతుల మీదుగా ఈ ల్యాబ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూపర్ స్టార్ మహేష్ బాబు, ప్రియాంక చోప్రా జోనాస్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న వారణాసి చిత్రంలోని కీలక సన్నివేశాలను ఇప్పటికే ఈ మోషన్ క్యాప్చర్ సాంకేతికతతో చిత్రీకరించినట్లు వెల్లడించారు.

ఇప్పటికే ఇదే స్టూడియోలో దేశంలోని తొలి డాల్బీ సినిమా ప్రాసెసింగ్ సదుపాయాన్ని ప్రారంభించిన రాజమౌళి, తాజా మోషన్ క్యాప్చర్ ల్యాబ్ దేశీయ దర్శకులకు మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ స్థాయి సాంకేతికత కోసం ఇంతవరకు విదేశాలపై ఆధారపడాల్సి వచ్చిందని, బాహుబలి, ఈగ చిత్రాల నిర్మాణ సమయంలో ఈ సదుపాయం భారత్‌లో ఉంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించేవాళ్లమని అన్నారు. ఇప్పుడు ఆ లోటు తీరిందని, భారతీయ కథనాల దృశ్య వైభవం మరో స్థాయికి చేరుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# మొదటి భాగం యువత కోసం.. రెండో భాగం కుటుంబాల కోసం

- శ్రీ విష్ణు
- ఫిబ్రవరి 27న

**'విష్ణు విన్యాసం' విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్**

యువ నటుడు శ్రీ విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న హాస్యభరిత చిత్రం విష్ణు విన్యాసం ఫిబ్రవరి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ నాయుడు నిర్మించిన ఈ చిత్రంలో నయన్ సారిక కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించాయి.



ప్రీ రిలీజ్ వేడుకలో శ్రీ విష్ణు మాట్లాడుతూ, కథ వినగానే ఎంతో నచ్చిందని తెలిపారు. నిర్మాతలు చిత్రాన్ని అత్యుత్తమంగా నిర్మించారని, తాము ఎంతో స్వేచ్ఛతో పనిచేసే అవకాశం కల్పించారని పేర్కొన్నారు. సాంకేతిక నిపుణులు, నటీనటులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.నయన్ సారిక నటన అద్భుతంగా ఉంటుందని, ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. దర్శకుడు యదునాథ్ మారుతీ రావు ఎంతో ప్రశాంతంగా, స్పష్టతతో సినిమా తీర్చిదిద్దారని చెప్పారు.'విష్ణు విన్యాసం' చిత్రం మొదటి భాగం యువతకు బాగా అనుసంధానమవుతుందని, రెండో భాగం కుటుంబ కథాంశంతో ఆకట్టుకుంటుందని శ్రీ విష్ణు వివరించారు. సినిమా పూర్తయ్యేసరికి మంచి అనుభూతి కలుగుతుందని, కుటుంబ సమేతంగా చూసి నవ్వుకునే వినోదాత్మక చిత్రమిదని అన్నారు. ఇది ఖచ్చితంగా విజయవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

హీరోయిన్ నయన్ సారిక మాట్లాడుతూ, తనకు మనీషా పాత్ర ఇచ్చిన దర్శకుడికి కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాతలు చిత్రానికి పూర్తి మద్దతు అందించారని చెప్పారు. శ్రీ విష్ణు నుంచి ప్రేక్షకులు ఆశించే అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉంటాయని, సినిమా అందరికీ నచ్చుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.నిర్మాత కేకే రాధామోహన్ మాట్లాడుతూ, శ్రీ విష్ణు చిత్రాలు ప్రేక్షకులకు రెండు గంటలపాటు నవ్వులు పంచి కష్టాలు మరిపిస్తాయని పేర్కొన్నారు. ఈ చిత్రం కూడా ప్రేక్షకాదరణ పొందాలని, నిర్మాతలకు విజయాన్ని అందించాలని ఆకాంక్షించారు.

## విజయ్ దేవరకొండ -- రష్మిక వివాహానికి ప్రధాని శుభాకాంక్షలు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**





టాలీవుడ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న నటుడు విజయ్ దేవరకొండ, నటి రష్మిక మందన్న వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. గురువారం జరగనున్న వీరి వివాహ వేడుకకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక శుభాకాంక్షలు పంపారు. విజయ్ దేవరకొండ తల్లిదండ్రులు పంపిన ఆహ్వాన పత్రానికి స్పందించిన ప్రధాని, నూతన దంపతులకు హృదయపూర్వక ఆశీస్సులు తెలిపారు.విజయ్, రష్మిక తమ జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నారని ప్రధాని సందేశంలో పేర్కొన్నారు. సప్తపది అనే పవిత్ర బంధంతో ఏడడుగులు వేసే ఈ దాంపత్య జీవితం ప్రేమ, పరస్పర గౌరవం, అనురాగంతో నిండి ఉండాలని ఆకాంక్షించారు. జీవితాంతం ఒకరికి ఒకరు తోడ్పాటుగా, స్నేహంతో ముందుకు సాగాలని ఆశీర్వదించారు. దేవరకొండ, మందన్న కుటుంబాలకు కూడా అభినందనలు తెలిపారు.

రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్ నగరంలో ఉన్న ఐటీసీ మెమెంటోస్ ఉదయ్‌పూర్లో ఈ వివాహ వేడుక జరుగుతోంది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుకను ఘనంగా నిర్వహిస్తున్నారు. సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరుకానున్నట్లు సమాచారం.ఈ వివాహం తెలుగు సంప్రదాయంతో పాటు రష్మిక కుటుంబానికి చెందిన కొడవ సంప్రదాయం ప్రకారం కూడా నిర్వహించనున్నారు. ముహూర్తం వివరాలను అధికారికంగా ప్రకటించకపోయినా, ఉదయం వేళల్లో ప్రధాన కార్యక్రమాలు జరుగనున్నట్లు తెలిసింది. ప్రధాని మోదీ ఆశీస్సులతో ఈ వివాహ వేడుకకు మరింత ప్రత్యేకత చేకూరింది. దేశవ్యాప్తంగా ఈ శుభవార్త చర్చనీయాంశమైంది.

## 'భోగి' ఫస్ట్ లుక్ విడుదల

- శర్వానంద్ రగ్గడ్ అవతార్‌లో మెరుపు

**బలగం టీవీ, హైదరాబాద్**




చార్మింగ్ స్టార్ శర్వానంద్ తొలిసారిగా దర్శకుడు సంపత్ నందితో కలిసి రూపొందిస్తున్న భారీ పీరియడ్ యాక్షన్ చిత్రం భోగికు సంబంధించిన తొలి దర్శన చిత్రాన్ని బుధవారం విడుదల చేశారు. శ్రీ సత్యసాయి ఆర్ట్ పతాకంపై కేకే రాధామోహన్ భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. విడుదలైన తొలి దర్శన చిత్రంలో శర్వానంద్ ఇంతకుముందెన్నడూ కనిపించని రగ్గడ్, ఉగ్ర మాస్ రూపంలో కనిపిస్తున్నారు. ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా రూపాంతరం చెందినట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి.

దర్శకుడు సంపత్ నంది ఈ చిత్రాన్ని 1960ల కాలంలో ఉత్తర తెలంగాణ -- మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ నిర్మాణ సెట్‌పై కీలక యాక్షన్ దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. ప్రముఖ యాక్షన్ రూపకర్త దిలీప్ సుబ్బరాయన్ ఈ ఘట్టాలను రూపుదిద్దుతున్నారు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఆగస్టు 28న రక్షా బంధన్ సందర్భంగా ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.

## ప్రముఖ యూట్యూబర్ కోమలి ఆత్మహత్య...

**బలగం టీవీ, హైదరాబాద్:**



మణికొండలోని చిత్రపురి కాలనీలో విషాదం నెలకొంది. ప్రముఖ యువ యూట్యూబర్ కోమలి తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, కోమలి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. ఏడాది క్రితం అఖిల్ రెడ్డి అనే వ్యక్తితో కోమలికి బ్రేకప్ అయ్యిందని, అప్పటి నుండి ఆమె తీవ్ర మనస్తాపంతో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మనోవేదన భరించలేక ఆమె బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

## ప్రియురాలితో షణ్ముఖ్ జశ్వంత్ నిశ్చితార్థం

**బలగం టీవీ, హైదరాబాద్**



కవర్ పాటలు, స్వల్ప చిత్రాల ద్వారా యూట్యూబ్ వేదికగా గుర్తింపు పొందిన యువ నటుడు షణ్ముఖ్ జశ్వంత్ తాజాగా నిశ్చితార్థం చేసుకున్నారు. బిగ్‌బాస్ కార్యక్రమంతో మరింత ప్రజాదరణ పొందిన ఆయన ప్రేమ విషయాన్ని ఈ ఏడాది ప్రారంభంలోనే అభిమానులతో పంచుకున్నారు. అయితే ఆ యువతి పేరు వెల్లడించకుండా కేవలం 'వి' అక్షరాన్ని మాత్రమే సూచించారు. ఫిబ్రవరి 25న నిశ్చితార్థం జరిగినట్లు షణ్ముఖ్ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించారు. ఆయన నిశ్చితార్థం అయిన యువతి వైష్ణవి చోడిశెట్టి అని తెలిసింది. ఆమె కూడా సామాజిక మాధ్యమాల్లో ప్రభావశీలురాలిగా కొనసాగుతున్నట్లు సమాచారం. నిశ్చితార్థ వేడుకకు సంబంధించిన చిత్రాలను పంచుకుంటూ "దేవుడు ఇలా నిర్ణయించాడు.. పూర్తైంది" అని షణ్ముఖ్ వ్యాఖ్యానించారు. ఈ చిత్రాల్లో షణ్ముఖ్, వైష్ణవి ఇద్దరూ బంగారు వర్ణ దుస్తుల్లో మెరిసిపోతున్నారు. ఈ సందర్భంగా అభిమానులు, సన్నిహితులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.